క్లుప్తంగా

శివయ్యకు రూ.5 లక్షల స్వర్ణ రుద్రాక్ష మాల



ఆలయ చైర్మన్ సీసీ సుదర్శన్‌రెడ్డికి రుద్రాక్ష మాలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామికి శుక్రవారం బెంగళూరుకు చెందిన అమృతమస్తు నిర్మాణాల సంస్థ అధినేత రాజసుధాకర్ రూ.5,75,580ల విలువైన బంగారు రుద్రాక్ష మాలను అందజేశారు. ఆయనకు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముమ్మరంగా భూ రీసర్వే

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్ అనంతాపురం, జీఎన్‌కండ్రిగ, పూసలపల్లె, చిన్నయగుంట, తహానగర్, గ్రామాల్లోని భూ రీసర్వే ముమ్మరంగా సాగుతోంది. వీఆర్‌ఓ భాస్కర్, సర్పంచ్‌లు వెంకటేష్, ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఈ గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టారు. వీఆర్వో మాట్లాడుతూ రీసర్వేలో అన్ రిజిష్టర్, వంశ పారంపర్యం భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తారని, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు.

వైభవంగా చెంగాళమ్మ జాతర ప్రారంభం




అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలో శ్రీచెంగాళమ్మ దేవత జాతర బ్రహోత్స వాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమైయ్యాయి. ఉదయం ఆలయంలో అమ్మవారి విగ్రహానికి వివిధ అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం, మైలు ముగ్గు తీర్పు, కలిశం ఉత్సవం, శేష పాన్పు, కలిశ గ్రామోత్సవం, పోతురాజు ముగ్గు కార్యక్రమాలు ఉంటాయి. ఆదివారం ఉదయం అంబళ్లు, శ్రీచెంగా ళమ్మ దేవత ముగ్గు, పొంగళ్లు, కార్యక్రమాలు జరుగుతాయి. సోమవారం ఉదయం అమ్మవారి ఊరేగింపు, ఎదురు పొంగళ్లు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. జాతరలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

రూ.20.50 లక్షలతో పాఠశాలకు వసతులు

సత్యవేడు: మండల పరిధిలోని రామచంద్రపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శ్రీసిటీలోని డైకీ అల్యూమినియం ఇండియా లిమిటెడ్ యాజమాన్యం రూ. 20.50 లక్షల వ్యయంతో వసతులు కల్పించింది. సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గదుల వసతి, విద్యార్థులకు డెస్కులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. శ్రీసిటీ ఫౌండేషన్ సూచన మేరకు డైకీ పరిశ్రమ యాజమాన్యం వితరణకు ముందుకొచ్చింది. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డైకీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పుజివారా తోషియుకి లాంఛనంగా తరగతి గది, మరుగుదొడ్డి తాళాలను అందజేశారు. ఇది తమ కంపెనీ చేపట్టిన మొట్టమొదటి సీఎస్సార్ కార్యక్రమని ఆయన తెలిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో డైకీ పరిశ్రమ సీఎస్సార్ చర్యలను అభినందించారు. శ్రీసిటీలోని పరిశ్రమలు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పలు పాఠశాలల్లో వసతులు మెరుగయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, వైఎస్సార్ పార్టీ నాయకుడు సన్యాసయ్య, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కష్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, సెక్యూరిటీ హెడ్ వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్రకుమార్, డైకీ డిప్యూటీ డివిజనల్ మేనేజర్ గౌరవ్ భల్లా, హెచ్‌ఆర్ మేనేజర్ రఫీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



శ్రీకాళహస్తి: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన షేక్ షఫి అహ్మద్ (52) కుటుంబానికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. షఫి అహమ్మద్ అనారోగ్యంతో మృతి చెందా రు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులను వారి ఇంటికి పంపించారు. వారు షఫి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎమ్మెల్యే పంపిన రూ. 10 వేలును అందజేశారు. ఫజిల్, రుశ్యేంద్ర మణి, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమం



వరదయ్యపాళెం: సీఎల్ఎన్‌పల్లెలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: ప్రభుత్వ సేవలను సులభంగా అందించాలన్న ధృఢ సంకల్పంతో జగనన్న సురక్షతో ముఖ్యమంత్రి జగనన్న ప్రజల వద్దకు పాలనను మరింత చేరువ చేశారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. శుక్రవారం మండలంలోని సీఎల్ఎన్‌పల్లె సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై 11 రకాల సేవలకు సంబంధించి 528 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అవస్థలు పడకుండా ఇళ్ల వద్దకే సంక్షేమాన్ని తీసుకువచ్చారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజాసంక్షేమం సాధ్యమని, అన్ని వర్గాల ప్రజలను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటున్న ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, సర్పంచులు దుడ్డు వేణు, అబ్దుల్ మజీద్, వీరభద్రం, లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఉషారాణి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పలువురు నాయకులు, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, డీటీ శాంతి, ఈఓపీఆర్డీ బసిరెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

సర్పంచ్ వేణు విన్నవించిన సమస్యలపై ఎమ్మెల్యే ఆదిమూలం స్పందిస్తూ ఆరికిచేలు రోడ్డు అభివృద్ధి విషయమై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని, త్వరలో నిధులు మంజూరవుతాయని తెలిపారు. తూర్పు హరిజనవాడ వాసులకు పొజిషన్ సర్టిఫికెట్లు తక్షణమే ఇవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ శాంతిని ఆదేశించారు. రాళ్లపాడు గిరిజనులకు కూడా మరోచోట ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పేదలకు మేలు చేకూర్చడమే లక్ష్యం



జగనన్న సురక్ష క్యాంపులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: రాష్ట్ర ప్రజలకు మేలు చేకూర్చాలన్న తపనతో సీఎం జగనన్న పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని కీళగరం సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. సురక్షలో దరఖాస్తు చేసుకున్న వారికి వ్యక్తిగత ధ్రువపత్రాలను, వేరుపడిన కుటుంబాలకు రైస్ కార్డులను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ మధ్యవర్తులు, దళారీలు లేకుండా నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి సంక్షేమ నగదును జమ చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తూ, పారదర్శక పాలన అందిస్తున్నారని అన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు సుదర్శనరెడ్డి, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, వైస్ ఎంపీపీ శివశంకర్, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, నాయకులు ఏకాంబరం, అన్నాదొరై, చిన్నదొరై, మణిరెడ్డి, సర్పంచ్‌లు రామ్మూర్తి, ధర్మలింగం, గుణశేఖర్, మురుగేశం, సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీటీసీలు రవి, పొన్నుస్వామి, తహశీల్దార్ ప్రమీల, ఎంపీడీవో గుణశేఖర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



ఊయలలో సేదతీరుతున్న అమ్మవారు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం శ్రీ పద్మావతీ అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. అంతర ప్రాకారం ప్రదక్షిణగా అమ్మవారిని ఊరేగించి ఊంజల్ మండపంలో ఊయలలో వేంచేపు చేశారు. వేద, నాద, గాత్ర కచ్చేరీల నడుమ అమ్మవారు ఊయలలో సేదతీరుతుండగా భక్తులు దర్శించి తరించారు.

హుండీ ఆదాయం రూ.5.69 లక్షలు

పిచ్చాటూరు: నాగలాపురంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీవేదనారాయణ స్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.5,69,688 లభించినట్లు ఆలయ అధికారి శీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో కానుకలను లెక్కించారు. సూపరింటెండెంట్ ఏకాంబరం, షరాబు ఉదయ్‌కుమార్, సిబ్బంది జానకిరామ్, ప్రభాకర్ పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బాబు అగ్రహారం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక అవధూత మాస పత్రిక యాజమాన్యం తెలిపింది. తమ పత్రిక ఎనిమిదో వార్షి కోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పత్రిక పబ్లిషర్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. గుండె వ్యాధులు, షుగర్, బీపీ, ఎముకలు, కంటి, కీళ్లు, చర్మ వ్యాధులకు సంబంధించి ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేస్తామన్నారు. ఈ వైద్య శిబిరానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తదితర వైద్యనిపుణులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరణియార్ గేట్ల వద్ద గుర్తు తెలియని మృతదేహం

పిచ్చాటూరు: అరణియార్ పాత గేటుజనరేటర్ రూమ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానిక పశువుల కాపరులు శుక్రవారం గుర్తించారు. స్థానిక ఇరిగేషన్, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఎముకలు కనిపిస్తున్నాయని, మృతుడు నెల క్రితం మరణించి ఉండవచ్చన్నారు. పక్కన ఒక బ్యాగు ఉందన్నారు. స్థానిక వీఆర్వో నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. శనివారం డాక్టర్లను పిలిపించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మృతుడు ఎవరు, ఎవరైనా హత్య చేశారా.. లేక ఆత్మహత్యనా అన్న విషయాలు విచారణలో తేలుతాయని వివరించారు.

రూ.25 కోట్ల స్థలం హాంఫట్!



సర్పంచ్ ఆక్రమణపై వివరాలు తెలుపుతున్న బాధిత బిల్డర్లు

- కబ్జాకు టీడీపీ సర్పంచ్ యత్నం
- అడ్డుకున్న బిల్డర్లు



కబ్జాకు ప్రయత్నిస్తున్న భూమి ఇదే

కేవీబీపురం: మండలంలోని పోలినాయుడుకండ్రిగలో టీడీపీ నేతలు పేదల భూములు ఆక్రమించుకున్న ఘటన మరవక ముందే మరో టీడీపీ నేత ఏకంగా రూ.25 కోట్ల విలువ చేసే ఒక పరిశ్రమ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని తిమ్మసముద్రం పంచాయతీలోని సర్వేనం.16, 18లోని వెరైటీ పాలిస్టర్‌కు చెందిన 43.13 ఎకరాల సెటిల్‌మెంట్ భూమిని అదే గ్రామ టీడీపీ సర్పంచ్ యర్రం దొరబాబునాయుడు కబ్జాకు యత్నించాడు. ఆ భూమి విలువ రూ.25 కోట్లు పైమాటే. సంబంధిత భూమిని డీపీఎంఆర్ డెవలపర్ సంస్థ కొనుగోలు చేయడంతో.. బాధిత బిల్డర్లు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. అనంతరం బిల్డర్లు మాట్లాడుతూ తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు తమ భూమిని కబ్జా చేసి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని.. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. నకిలీ పత్రాలు సృష్టించి తమపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దొరికిపోయింది ఇలా..

టీడీపీ నేత దొరబాబునాయుడు రూ.25 కోట్ల విలువ చేసే భూమిని కబ్జా చేసి అతితెలివిని కనబరిచారు. ఒక సంస్థకు చెందిన సెంటు భూమిని విక్రయించాలన్నా.. ఆ సంస్థలో ఉన్న భాగస్వాములు, కమిటీ బోర్డు అనుమతి ఇచ్చిన తరువాతే సాధ్యమవుతుంది. ఈ ఘటనలో మాత్రం ఆ సంస్థలో ఒక ముఖ్య భాగస్వామి 30-04-2016 తేదీన దొరబాబునాయుడుకు ఇదే సర్వే నంబరులో 8 ఎకరాలను రూ.43.20 లక్షలకు విక్రయించినట్లు రూ.10 బాండు పేపర్‌పై విక్రయ అగ్రిమెంట్‌ను తయారు చేసుకున్నాడు. వాస్తవానికి అదే తేదీలో ఆ ముఖ్య భాగస్వామి నాగ్‌పూర్‌లో ఉన్నట్లు ఆ ప్రాంతంలో రూ.10 వేలు విత్‌డ్రా చేసినట్లు సాక్ష్యలను బాధిత బిల్డర్లు పోలీసుల ముందు ఉంచారు. ఈ స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నంలోనే టీడీపీ నేత తప్పుడు పత్రాలను సృష్టించారిన బాధిత బిల్డర్లు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నదిలో పడి యువకుడికి తీవ్ర గాయాలు



యువకుడిని వెలికి తెస్తున్న స్థానికులు

శ్రీకాళహస్తి: రామ సేతు వంతెన వద్ద శుక్రవారం మురళి (30) మద్యం మత్తులో స్వర్ణముఖి నదిలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం.. పెళ్లకూరు మండలం, చెంబేడు ఎస్టీ కాలనీకి చెందిన ధనుంజయులు కుమారుడు మురళి స్థానికంగా ఓ ప్రవేటు ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగి స్వర్ణముఖి ఫ్లడ్వాల్ పైన అదుపు తప్పి నదిలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి అతన్ని బయటకు తీశారు. ఆపై 108 సిబ్బంది స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రుడ్ని తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఘనంగా అధిక శ్రావణ మాస పూజలు



శ్రీకాళహస్తి : వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ పూజల్లో పాల్గొన్న భక్తులు



రేణిగుంట : విశేషాలంకరణలో అమ్మవారు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బజారు వీధిలో వెలసి ఉన్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అధిక శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ, అష్టలక్ష్మి విగ్రహాలను ఏర్పాటు చేసి అష్టోత్తర పూజలు నిర్వహించారు. వంద మంది ఆర్యవైశ్య మహిళలు కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు

వేడుకగా ఆడిమాస పూజలు

రేణిగుంట: చెక్‌పోస్టు సమీపంలోని పత్నికులం కాలనీలో వెలసిన కొల్లాపురి అమ్మవారి ఆలయంలో తమిళ ఆడిమాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

విద్యార్థిని చదువుకు ఎమ్మెల్యే మధు సాయం



విద్యార్థిని కౌసల్యకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: రేణిగుంట మండలం అల్లికేశంలో ఓ పేద విద్యార్థిని చదువు కోసం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.15వేలు ఆర్థిక సాయం అందించి మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి ఇంటింటికీ వెళ్లిన ఆయనకు ఓ కుటుంబం తమ బిడ్డ కౌసల్య ఇంటర్మీడియెట్ పూర్తి చేసి నర్సింగ్ కోర్సులో చేరేందుకు ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి నర్సింగ్ ఫీజుకు రూ.15వేలు నగదు ఆమెకు అందజేశారు. ఉన్నత చదువుకు సైతం సాయం చేస్తానని వారికి భరోసా ఇచ్చారు. కుమారుడు బాలాజీ చదువులకు కూడా సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సామాన్యులకు రక్ష



ఇలగనూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): జగనన్న సురక్షతో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలు అందిస్తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇలగనూరు, శివనాథపాళెం సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి అందించడం, సర్టిఫికెట్లు ఉచితంగా అందచేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గతంలో మన సమస్య చెప్పుకునే దానికి అధికారులు, నాయకులు అందుబాటులో ఉండేవారు కారని, ఇప్పుడు అలాంటి సమస్య లేకుండా అధికారులే నేరుగా ఇంటి గుమ్మం వద్దకు వచ్చి సమస్య తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఏ సహాయం కావాలన్నా ఎమ్మెల్యే కార్యాలయంలో ఎల్లప్పుడూ మీకోసం అందుబాటులో ఉంటుందని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం ఇలగనూరులో 1200, శివనాథపాళెంలో 585 సర్టిఫికెట్లు అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం నాయుడు, నాయకులు రమణయ్యనాయుడు, చంద్రయ్యనాయుడు, రామనాయుడు, మణి, భాస్కర్ రెడ్డి, ముకుంద, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక వికాస కేంద్రాలు



పూజల్లో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): దేవాలయాలు మానసిక వికాస కేంద్రాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి పవిత్ర రెడ్డి అన్నారు. శుక్రవారం తొట్టంబేడు పంచాయితీ శ్రీరామనగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమారియమ్మ తల్లి ఆలయ మహ కుంభాభిషేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆమె మాట్లాడుతూ ఆలయ ఉత్సవాలు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతను చాటుతాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధం సమష్టి బాధ్యత




కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా ముచ్చివోలు సచివాలయంలో శుక్రవారం సిబ్బందికి, ఆరోగ్య కార్యకర్తలకు, వలంటీర్లకు ప్రగతి సంస్థ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు, అపహరణ, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ, పిల్లలపై ఇతర నేరాల వంటి సమస్యలతో ముడిపడి ఉన్న మానవ అక్రమ రవాణాను అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రగతి మండల కోఆర్డినేటర్ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సాయి విజయ్, సచివాలయ సిబ్బంది, ప్రగతి మండల కోఆర్డినేటర్ ప్రభాకర్, రామచంద్రయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన

శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీధర్మరాజులస్వామి గుడి ఎదురుగా ఉన్న బాలికోన్నత వసతి గృహంలో శుక్రవారం చట్టాలు, పిల్లల అక్రమ రవాణా నిర్మూలనపై న్యాయ వాదులు అవగాహన కల్పించారు. న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ముందుగా భోజన, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో భవిష్యత్తు ఆశలు, ఆశయాలతో వసతి గృహాల్లో ఉంచి చదివిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకుని క్రమశిక్షణతో బాగా చదవాలని సూచించారు. ఎవరైనా అనుమాన స్పదంగా ఉంటే వార్డెన్ కు లేదా మీ పాఠశాల ఉపాధ్యాయులకు తెలపాలన్నారు. న్యాయవాదులు గరికపాటి రమేష్, అరుణ్, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటర్లు పాల్గొన్నారు.

వేడుకగా పుష్పపల్లకీ సేవ



పుష్పపల్లకీపై అర్జునుడి ఊరేగింపు

పిచ్చాటూరు: మండల కేంద్రంలోని శ్రీధర్మరాజుల స్వామి ఆలయ తిరునాళ్లలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం అర్జున తపస్సు అంగరంగ వైభవంగా జరిగింది. రాత్రి అర్జునుడి ఉత్సవమూర్తిని పుష్పపల్లకిపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. కంకణాలు ధరించిన దీక్షాపరులు ఊరేగింపు సేవలో తరించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన ఈశ్వర్

శ్రీకాళహస్తి: పట్టణానికి సమీపంలో మిట్ట కండ్రిగ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి బైరాగి పట్టడికి చెందిన ఈశ్వర్(23) మృతి చెందాడు. కమలమ్మ(80)అనే వృద్ధు రాలికి తీవ్ర గాయాలు కాగా లీలాప్రసాద్ (30) స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల కథనం మేరకు శ్రీకాళహస్తి పట్టణం కుందేటి వారి వీధికి చెందిన కమలమ్మ మనవడు లీలాప్రసాద్‌తో కలిసి రెండు రోజుల కిందట తిరుపతి బంధువుల ఇంటికి వెళ్లింది. వారి బంధువైన అంజూరు ఈశ్వర్‌తో కలిసి స్కూటీపై శుక్రవారం బయలుదేరి శ్రీకాళహస్తికి వస్తుండగా మిట్ట కండ్రిగ వద్ద కమలమ్మ జారిపోవడంతో స్కూటర్ అదుపు తప్పి రోడ్డు మీద అటుగా వస్తున్న లారీ కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఈశ్వర్ (30) అక్కడికక్కడే మృతి చెందగా, కమలమ్మ తీవ్రం గాయపడింది. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతి రుయాకు తరలించారు.

గంగ కాలువలో పడి బ్యాంక్ ఉద్యోగి మృతి

- జాతరకు వచ్చి..
- మృతుడు ప్రకాశం జిల్లావాసి





నీటిలో తేలియాడుతున్న మృతదేహం, (ఇన్‌సెట్) వెంకటనరేంద్ర (ఫైల్)

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : ప్రమాదవశాత్తు తెలుగు గంగ కాలువలో పడి ఓ బ్యాంకు ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలోని తంగేళ్లపాళెం సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, మల్లవరపుపాడు గ్రామానికి చెందిన వెంకటనరేంద్ర(32) బెంగళూరులోని యాక్సిస్ బ్యాంకులో అకౌంటెంట్. గురువారం తంగేళ్లపాళెం క్రాస్ వద్ద ఉన్న క్వారీ కార్మికుల కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీమరియమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతర వేడుకల్లో పాల్గొనేందుకు భార్య సరిత, నాలుగేళ్ల కుమార్తెతో కలిసి అతని మిత్రుడు చెంచురత్నం ఇంటికి వచ్చాడు. గురువారం రాత్రి కాలనీ సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలోపడి గల్లంతయ్యాడు. పోలీసులు శుక్రవారం ఉదయం స్థానికుల సహకారంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా చిట్టత్తురు సమీపంలోని కాలువలో వెంకటనరేంద్ర మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.